నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, శుక్రవారం 13 డిసెంబర్ 2024 | BHADRADRI KOTHAGUDEM

'గ్రూప్-2'కు 13,465 మంది అభ్యర్థులు: ఏసీ

అదనపు కలెక్టర్

కొత్తగూడెం ఎడ్యుకేషన్, డిసెంబర్ 12: గ్రూప్-2 పరీక్షను అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ వేణుగోపాల్ అన్నారు. గ్రూప్-2 పరీక్ష నిర్వహణ, బయోమెట్రిక్ విధానం అమలుపై చీఫ్ సూపరింటెండెంట్లు, ఐడెంటిఫికేషన్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్, డిపార్ట్‌మెంటల్ అధికారులు, లోకల్, జాయింట్ రూట్ అధికారులు, బయోమెట్రిక్ ఇన్విజిలేటర్లకు ఐడీవోసీలో గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ నెల 15, 16 తేదీల్లో 38 కేంద్రాల్లో నిర్వహించే గ్రూప్-2 పరీక్షలను 13,465 మంది అభ్యర్థులు రాయనున్నట్లు తెలిపారు. అభ్యర్థులకు ఈసారి బయోమెట్రిక్ అటెండెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. అభ్యర్థులకు ఏమైనా సందేహాలు ఉంటే ఐడీవోసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన 9392919706, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఏర్పాటు చేసిన 040-23542185, 040-23542187 టోల్ ఫ్రీ నంబర్లకు ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంప్రదించి నివృత్తి చేసుకోవచ్చన్నారు. పరీక్షల కన్వీనర్ హరికృష్ణ, డీఎస్పీ ఏఆర్ సత్యనారాయణ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

భద్రాచలం ఎంపీడీవో కార్యాలయంలో కుట్టుమిషన్లు (ఫైల్)

అన్నింటా అదే కుట్ర

'తెలంగాణలో కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తా.. కేసీఆర్ అనే మొక్కను ఇకపై మొలవనీయను..' అంటూ అన్ని సభల్లో శపథాలు చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి.. అందుకు అనుగుణంగానే కుట్రలు పన్నుతున్నారు. స్వరాష్ట్ర సాధకుడి పేరు వినిపించినా, కనిపించినా కలవరం చెందుతున్న ఆయన.. 'కేసీఆర్' పేరుతో ఉన్న పథకాలను పూర్తిగా పక్కకు పెట్టారు. ఇందులో భాగంగా ఇప్పటికే అనేక పథకాలను ఇందులో చేర్చినప్పటికీ తాజాగా మరో పథకమూ వెలుగులోకి వచ్చింది. మైనార్టీల్లోని ఒంటరి మహిళల ఆర్థికాభివృద్ధికి ఉపకరించేందుకు 'కేసీఆర్ తోఫా' పేరుతో తీసుకొచ్చిన కుట్టుమిషన్ల పంపిణీని కూడా అటకెక్కించారు. -భద్రాచలం, డిసెంబర్ 12

- అందుకే ఆనవాళ్లు చెరిపేస్తానంటూ పదేపదే ప్రగల్భాలు
- మైనార్టీ ఒంటరి మహిళల ఆర్థికాభివృద్ధికి రేవంత్ అడ్డుకట్ట
- కేసీఆర్ పేరున్న కారణంతో ఏడాదిగా 'తోఫా' పంపిణీకి బ్రేక్
- ఎంపీడీవో కార్యాలయంలో మూలుగుతున్న కుట్టుమిషన్లు
- స్వరాష్ట్ర సాధకుడిపై కోపంతో 'కేసీఆర్ తోఫా' నిలుపుదల

ఏడాది క్రితం అసెంబ్లీ ఎన్నికలకు ముందే ఈ పథకం వచ్చింది. దీనిలో భాగంగా అప్పటికే కొంతమంది లబ్ధిదారులకు కుట్టుమిషన్లను అప్పటి ప్రభుత్వం పంపిణీ చేసింది. ఆ సమయంలో వచ్చిన ఎన్నికల కోడ్ కారణంగా అప్పటి అధికారులు ఆ మిషన్ల పంపిణీని ఆపారు. కొత్తగా వచ్చిన ప్రభుత్వం ఆయా కుట్టుమిషన్లను సదరు లబ్ధిదారులకు పంపిణీ చేయాల్సి ఉంది. కానీ.. ఆ మిషన్లకు కేసీఆర్ పేరు ఉండడం, వాటిపై కేసీఆర్ ఫొటో ఉండడం వంటి కారణాలతో కాంగ్రెస్ ప్రభుత్వం వాటి పంపిణీని నిలిపివేసింది. మైనార్టీ మహిళలు తమ కాళ్లపై తాము నిలబడి ఉపాధి పొందేందుకు, మరికొందరికి ఉపాధి కల్పించేందుకు గత కేసీఆర్ ప్రభుత్వం తెచ్చిన గొప్ప పథకాన్ని నీరుగార్చింది. కేవలం కేసీఆర్ మీద ఉన్న కోపంతో ఆ మహిళల ఆశలపైనా నీళ్లు చల్లింది.

ఏడాదిగా మూలుగుతున్న మిషన్లు..

కేసీఆర్ తోఫా పేరిట వచ్చిన ఈ కుట్టుమిషన్లను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పంపిణీ చేయకపోవడంతో భద్రాచలం నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో అవి పేరుకుపోయాయి. భద్రాచలం ఎంపీడీవో కార్యాలయంలోనూ ఏడాదికాలంగా ఇవి మూలుగుతున్నాయి. అయితే, కేసీఆర్ మీద కోపంగా ఉన్న ఈ కాంగ్రెస్ ప్రభుత్వం తమకు శాపంగా పరిణమించిందని పలువురు మైనార్టీ మహిళలు ఆరోపిస్తున్నారు. నియోజకవర్గానికి 100 చొప్పున అప్పట్లోనే కుట్టుమిషన్లను మంజూరు చేయగా.. భద్రాచలంలో అర్హత పొందిన వారిలో కొంతమంది మైనార్టీ మహిళలు పంపిణీ చేశారని, ఎన్నికల నియమావళి కారణంగా మరికొందరికి పంపిణీ నిలిపివేశారని చెబుతున్నారు. ప్రజాపాలన అంటూ గొప్పగా చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. వాస్తవంలో అందుకు భిన్నంగా వ్యవహరిస్తోందని విమర్శిస్తున్నారు. తమకు ఇంత వరకూ వాటిని పంపిణీ చేయకుండా, ఆర్థిక స్వావలంబనను తమ దరికి చేరనీయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డుపడుతోందని దుయ్యబడుతున్నారు. కుట్టుమిషన్లతో స్వయం ఉపాధి పొందుతూ, మరికొందరికి ఉపాధి కల్పిస్తూ బతుకుదామనుకున్న తమను ఈ ప్రభుత్వం అగౌరవపరుస్తోందని ధ్వజమెత్తుతున్నారు.

ఆందోళనకు వెనుకాడం..

మైనార్టీలోని ఒంటరి మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం కేసీఆర్ తోఫా పేరుతో సరఫరా చేసిన కుట్టుమిషన్లను భద్రాద్రి జిల్లాలో కాంగ్రెస్ ప్రభుత్వం పంపిణీ చేయలేదు. ఎన్నికలకు ముందే కొన్నింటిని అప్పటి ప్రభుత్వం పంపిణీ చేసింది. తర్వాత వచ్చిన రేవంత్ ప్రభుత్వం మిగతా వాటిని మూలకుపడేసింది. వాటిని పంపిణీ చేయకపోతే ఆందోళనలకూ వెనుకాడం.
-జలాల్ అహ్మద్, సేవ్ కొత్తగూడెం కన్వీనర్, కొత్తగూడెం

వెంటనే పంపిణీ చేయాలి..

గత కేసీఆర్ ప్రభుత్వంలో మైనార్టీల్లోని ఒంటరి మహిళల కోసం తెచ్చిన కుట్టుమిషన్లను ఇప్పటి ప్రభుత్వం తక్షణమే పంపిణీ చేయాలి. వాటిని అందిస్తే తాము ఆర్థికంగా నిలదొక్కుకోగలుగుతాం. తోటి మహిళలకు ఉపాధినీ కల్పిస్తాం. వీటి పంపిణీ కోసం ఏడాదికాలంగా ఎదురుచూస్తున్నాం. ఇప్పటికే పంపిణీ చేసి మాకు ఉపాధి మార్గం చూపాలి.
-షేక్ ఫర్జీన్, మైనార్టీ మహిళ, భద్రాచలం



- 'అబూజ్‌మడ్'లో ఎదురుకాల్పులు
- ఏడుగురు మావోయిస్టులు మృతి
- పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తాం
- నారాయణ్‌పూర్ ఎస్పీ ప్రభాత్‌కుమార్
- అడవిని చుట్టుముట్టిన జిల్లాల బలగాలు

దద్దరిల్లిన దండకారణ్యం

కొత్తగూడెం క్రైం, డిసెంబర్ 12: తెలతెలవారుతుండగానే తుపాకుల గుండ్ల మోత.. నలుదిక్కులా సాయుధ దళాల దండయాత్ర.. ఎటువైపు నుంచి ఎవరు దాడి చేస్తున్నారో అర్థంకాని పరిస్థితి.. ఒళ్లు గగుర్పొడిచే భయానక వాతావరణం.. పచ్చటి చెట్లపై మంచు తుంపరలకు బదులుగా ఎర్రటి రక్తపు మరకలు. మావోయిస్టులు, భద్రతా బలగాలకు మధ్య జరిగిన భీకర పోరులో ఏడుగురు మావోయిస్టులు మృతిచెందారు. వారిలో ఇద్దరు మహిళలు ఉన్నారు. ఈ ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణ్‌పూర్-దంతేవాడ జిల్లాల సరిహద్దుల్లోని దక్షిణ అబూజ్‌మడ్ ప్రాంతంలో గురువారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. నారాయణ్‌పూర్-దంతేవాడ జిల్లాల సరిహద్దు దక్షిణ అబూజ్‌మడ్ ప్రాంతంలో మావోయిస్టులు సమావేశమవుతున్నట్లు పోలీస్ ఉన్నతాధికారులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో నారాయణ్‌పూర్ జిల్లా రిజర్వ్ గార్డ్స్(డీఆర్‌జీ) బలగాలతోపాటు దంతేవాడ, బస్తర్, కొండగావ్ జిల్లాల సీఆర్‌పీఎఫ్ దళాలు సంయుక్తంగా సెర్చింగ్ ఆపరేషన్స్ చేపట్టాయి. తెల్లవారుజామున 3 గంటల సమయంలో మావోయిస్టులు తారసపడి భద్రతా దళాలపైకి కాల్పులు జరిపారు. అప్పటికే అప్రమత్తంగా ఉన్న భద్రతా దళాలు ఎదురు కాల్పులకు దిగాయి. మసక చీకట్లో ఇరువర్గాలు సుమారు రెండు గంటల పాటు హోరాహోరీ తలపడ్డాయి. నలుదిక్కుల నుంచి వస్తున్న భద్రతా దళాల తూటాల ధాటికి తాళలేక మావోయిస్టులు కాల్పులు జరుపుకుంటూ దట్టమైన అటవీ మార్గంలోకి పారిపోయారు. వెంటనే ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్న భద్రతా దళాలు గాలింపు చర్యలు ముమ్మరం చేశాయి. ఘటనా స్థలంలో ఎదురు కాల్పుల్లో మృతిచెందిన ఏడుగురు మావోయిస్టుల మృతదేహాలతోపాటు వారికి సంబంధించిన ఆయుధ, వస్తు సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు నారాయణ్‌పూర్ జిల్లా ఎస్పీ ప్రభాత్‌కుమార్ తెలిపారు. దట్టమైన అటవీ ప్రాంతం కావడంతో మృతదేహాలను అక్కడి నుంచి తరలించే ప్రయత్నం చేస్తున్నామని, మృతులు ఇంద్రావతి ఏరియా కమిటీకి చెందిన మావోయిస్టులుగా గుర్తించినట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని ఎస్పీ చెప్పారు. అయితే మావోయిస్టులు తమ ఉనికిని చాటుకునేందుకు వరుస విధ్వంసాలు సృష్టిస్తున్న క్రమంలో ఈ ఎన్‌కౌంటర్ వారికి పెద్ద ఎదురుదెబ్బగా మారింది. ఈ ఏడాది బస్తర్ రేంజ్ పరిధిలో జరిగిన ఎదురుకాల్పుల్లో సుమారు 217 మంది మావోయిస్టులు మృతిచెందారు. మృతుల్లో కీలక నేతలు కూడా ఉండడంతో ఆ పార్టీకి ఈ ఏడాది కొంత చేదు అనుభవం ఎదురైందని చెప్పొచ్చు. 2025 నాటికి 'ఆపరేషన్ కగార్' పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మావోయిస్టు పార్టీని సమూలంగా పెకిలించేందుకు దూకుడు పెంచాయనడానికి ఈ ఏడాది జరుగుతున్న ఎన్‌కౌంటర్లే నిదర్శనమని తెలుస్తోంది. దక్షిణ అబూజ్‌మడ్‌లో జరిగిన ఎదురుకాల్పుల్లో నాలుగు జిల్లాలకు చెందిన భద్రతా దళాలు ఒక్కసారిగా చుట్టుముట్టడం గమనార్హం. ఈ ఎన్‌కౌంటర్‌పై ప్రతీకారేచ్ఛతో రగిలిపోతున్న మావోయిస్టులు మున్ముందు ఎలాంటి విధ్వంసాలు సృష్టిస్తారోనని మావోయిస్టు ప్రభావిత ఏజెన్సీ ప్రాంత వాసులు హడలిపోతున్నారు.

దరఖాస్తులపై శాస్త్రీయ అధ్యయనం

ఖమ్మం విచారణలో ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్

మాట్లాడుతున్న కమిషన్ చైర్మన్

మామిళ్లగూడెం, డిసెంబర్ 12: షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణపై స్వీకరించిన దరఖాస్తులన్నింటినీ క్రోడీకరించి శాస్త్రీయ అధ్యయనం చేసిన తర్వాత ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని రాష్ట్ర ఎస్సీ ఏకసభ్య కమిషన్ చైర్మన్ జస్టిస్ డాక్టర్ షమీమ్ అక్తర్ స్పష్టం చేశారు. ఖమ్మం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణపై అధ్యయనం నిమిత్తం ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎస్సీ కులాలు, కుల సంఘాలు, వ్యక్తులతో గురువారం బహిరంగ విచారణ చేపట్టారు. పలు షెడ్యూల్ కులాల సంఘాలు, వ్యక్తులు.. ఉప వర్గీకరణపై కమిషన్‌కు దరఖాస్తులు సమర్పించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ బహిరంగ విచారణలో స్వీకరించిన దరఖాస్తులు, అభిప్రాయాలన్నింటినీ శాస్త్రీయంగా అధ్యయనం చేస్తామన్నారు. దరఖాస్తులు సమర్పించే వారు ఎలాంటి ఆటంకం లేకుండా స్వేచ్ఛగా అందజేయవచ్చని పేర్కొన్నారు. జిల్లాల సందర్శనలో దరఖాస్తులు సమర్పించలేకపోయిన వారు హైదరాబాద్‌లో నేరుగా కమిషన్‌కు తమ అభిప్రాయాలను తెలియజేయవచ్చన్నారు.

నూతన మెనూ బోర్డు ప్రదర్శించాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి శరత్

గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శితో వీసీలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో రాహుల్

భద్రాచలం, డిసెంబర్ 12: గిరిజన ఆశ్రమ, గురుకుల, ఈఎంఆర్ఎస్ పాఠశాలలతోపాటు వసతి గృహాల్లో ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన డైట్ చార్జెస్, కాస్మోటిక్, మెనూ వివరాలను డిస్‌ప్లే బోర్డుపై కచ్చితంగా ప్రదర్శించాలని గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి శరత్ ఆదేశించారు. గురువారం హైదరాబాద్ కమిషనర్ కార్యాలయం నుంచి అడిషనల్ డైరెక్టర్ సర్వేశ్‌రెడ్డితో కలిసి గురువారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా.. భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్, డీడీ మణెమ్మ, ఆర్‌సీవో నాగార్జున పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14న ఐటీడీఏ ప్రాజెక్టు అధికారులు, డీడీ ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు, డీటీడీవోలతో ప్రతి ఇనిస్టిట్యూట్ ఒరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహణకు తీసుకోవాల్సిన కార్యాచరణపై ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనిని నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం పీవో రాహుల్ మాట్లాడుతూ మెనూ, డైట్, కాస్మోటిక్ చార్జీలకు సంబంధించి బోర్డులు రాయించి అందరికీ తెలిసేలా ప్రదర్శిస్తామని తెలిపారు. ప్రత్యేక మెనూ ప్రకారం భోజనాలు చేయించి ఫుడ్ కమిటీ స్పెషల్ అధికారులు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొనేలా చేసి సహపంక్తి భోజనాలకు ప్రణాళిక రూపొందిస్తామని వివరించారు.

కొర్రీలు పెట్టకుండా ధాన్యం కొనాలి

- నారాయణపురం గ్రామంలో రైతుల రాస్తారోకో..
- తహసీల్దార్ హామీతో ఆందోళన విరమణ

ప్రధాన రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు

అశ్వారావుపేట, డిసెంబర్ 12: కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి షరతులు, కొర్రీలు పెట్టకుండా ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం నారాయణపురం గ్రామంలో ప్రధాన రహదారిపై గురువారం రైతులు రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ సొసైటీ పరిధిలో పట్టాలు లేని భూముల్లో తాము పండించిన ధాన్యం కొనుగోలు చేయడం సాధ్యం కాదని అధికారులు చెబుతున్నారని, దీంతో గత్యంతరం లేక ఆందోళన చేపట్టామన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో పట్టాలు పొందడానికి కొన్ని ఇబ్బందులు ఉన్నాయని, 4సీ పట్టా భూముల్లో ధాన్యం పండిస్తే కొనుగోలు చేయడానికి అధికారులు నిరాకరిస్తున్నారని రైతులు రాయగిరి మల్లేశ్వరరావు, చందా లక్ష్మీనర్సయ్య, బల్లం గంగరాజు, కుమారస్వామి, మిండా దుర్గారావు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా కొనుగోలు చేసిన అధికారులకు ఇప్పుడు ఏమైందని వారు ప్రశ్నించారు. విషయం తెలుసుకున్న అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ.. ఘటనా స్థలానికి వెళ్లి సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ పి.కృష్ణప్రసాద్ నారాయణపురం కొనుగోలు కేంద్రానికి చేరుకుని రైతులతో మాట్లాడారు. పట్టాలు లేకున్నా ధాన్యం కొనుగోలు చేస్తామని, ఆధార్ కార్డు లేదా భూమి ఆధారాలను బట్టి ధాన్యం తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

అధికారుల వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న భద్రాద్రి కలెక్టర్ జితేశ్ పాటిల్

ఇందిరమ్మ ఇళ్ల యాప్ సర్వేను..

నెలాఖరులోగా పూర్తి చేయండి

గ్రామస్థాయిలో అందిన దరఖాస్తులపై నివేదిక ఇవ్వండి: కలెక్టర్

భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబర్ 12 (నమస్తే తెలంగాణ): నెలాఖరులోగా ఇందిరమ్మ ఇండ్ల మొబైల్ యాప్ సర్వేను పూర్తి చేయాలని భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. ఐడీవోసీ కార్యాలయ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఇందిరమ్మ ఇండ్ల యాప్ సర్వే, గ్రూప్-2 పరీక్షల నిర్వహణ, నూతన డైట్ మెనూ పెంపు ప్రారంభోత్సవ కార్యక్రమాలపై అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, విద్యాచందనలతో కలిసి ఆర్డీవోలు, తహసీల్దార్లు, జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, పంచాయతీ సెక్రటరీలు, సంబంధిత అధికారులతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇండ్ల దరఖాస్తుల సర్వే త్వరితగతిన పూర్తయ్యేలా ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా, మండల, గ్రామ స్థాయిలో ఎన్ని దరఖాస్తులు వచ్చాయనే దానిపై నివేదిక తయారు చేయాలని, ఎక్కువ దరఖాస్తులు ఉన్నచోట సర్వేకు అదనపు సిబ్బందిని కేటాయించాలన్నారు. భద్రాచలం, కొత్తగూడెం ఆర్డీవోలు త్వరితగతిన ఇందిరమ్మ ఇండ్ల మోడల్ హౌస్‌లు నిర్మించాలని ఆదేశించారు. ప్రభుత్వం పిల్లలకు అందించే డైట్ చార్జీలు 40 శాతం పెంచిందని, దీనికి సంబంధించి ప్రారంభోత్సవ కార్యక్రమం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఘనంగా నిర్వహించాలని అధికారులను సూచించారు. ఆర్డీవోలు, పంచాయతీ అధికారులు తమ పరిధిలోని హాస్టళ్లు, ఆశ్రమ, రెసిడెన్షియల్ పాఠశాలల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను పర్యవేక్షించాలని ఆదేశించారు.

ఎనిమిది నెలలు.. వేతనాలు నిలు

- ఆర్థికంగా అల్లాడిపోతున్న మెప్మా రిసోర్స్ పర్సన్లు
- కుటుంబాలకు ఆకలిని మిగిల్చిన కాంగ్రెస్ ప్రభుత్వం
- ఇతర సమస్యల పరిష్కారంలోనూ మొండిచేయి
- విసిగి వేసారి ప్రభుత్వంపై పోరుబాట పట్టిన ఆర్‌పీలు
- నేడు హైదరాబాద్‌లో డీఎం కార్యాలయం ఎదుట ధర్నా

ప్రభుత్వ పథకాలను పట్టణాల్లో క్షేత్రస్థాయికి తీసుకెళ్తున్న మెప్మా రిసోర్స్ పర్సన్లు (ఆర్‌పీ) ఆకలితో అలమటించేలా చేస్తోంది ఏడాది క్రితం వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం. ఏకంగా ఎనిమిది నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో వారి కుటుంబాలన్నీ ఆకలితో అల్లాడిపోతున్నాయి. కిరాణా సరుకులు అరువు ఇచ్చిన దుకాణదారులు కూడా అప్పు తీర్చాలంటూ ఎనిమిది నెలలుగా అడుగుతుండడంతో వారికి మొఖం చూపించడానికి కూడా ముందూవెనుకా ఆలోచిస్తున్నారు ఆర్‌పీలు. ఇక వారి ఇతర సమస్యలనూ కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకున్న పాపానపోలేదు. దీంతో విసిగిపోయిన ఆర్‌పీలు ఆందోళనబాట పట్టారు.
-కొత్తగూడెం అర్బన్, డిసెంబర్ 12

కొత్తగూడెం పట్టణంలో ఇంటింటి సర్వే చేస్తున్న రిసోర్స్ పర్సన్ (ఫైల్)

ప్రభుత్వ పథకాలను ప్రచారం చేసేందుకు, ప్రభుత్వం చేపట్టే సర్వేలను పూర్తి చేసేందుకు, ఇతర సర్కారు సంబంధ పనులను క్షేత్రస్థాయికి తీసుకెళ్లేందుకు మొదటగా గుర్తుకొచ్చేది స్వయం సహాయక సంఘాల మహిళలే. ఆ మహిళా సభ్యులను ఎప్పటికప్పుడు సమన్వయం చేస్తూ ప్రభుత్వం అప్పగించిన బాధ్యతను తూచా తప్పకుండా నిర్వహిస్తున్నారు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) రిసోర్స్ పర్సన్లు. మహిళల ఆర్థికాభివృద్ధికి రుణాలు అందించేందుకు, వారి కాళ్లపై వారు నిలదొక్కుకునేలా చేసేందుకు ప్రభుత్వం 2008లో ఈ వ్యవస్థను రూపొందించింది. గత పదేళ్లుగా స్వయం సహాయక సంఘాల సభ్యులను సమన్వయం చేస్తూ, రూ.1,200 గౌరవ వేతనంతో స్వచ్ఛందంగా కార్యకలాపాలను నిర్వహిస్తూ రిసోర్స్ పర్సన్లు(ఆర్‌పీ)లు నివేదికలను అందజేస్తున్నారు. ముఖ్యంగా ప్రభుత్వ పథకాలను ప్రచారం చేయడంలో వీరు ఎంతో ముఖ్యమైన పాత్రను పోషిస్తున్నారు. తెలంగాణ ఆవిర్భవించాక వీరి శ్రమను గుర్తించిన గత కేసీఆర్ ప్రభుత్వం వీరి గౌరవ వేతనాన్ని రూ.4,000కు పెంచింది. వారి కష్టాలను కొంతవరకు దూరం చేసింది. ఆ తర్వాత 2023 ఎన్నికలకు ముందు మరోసారి ఆర్‌పీల వేతనాలను రూ.6,000కు పెంచింది. ఆ తర్వాత కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం నాలుగు నెలలపాటు ఆ రూ.6,000 చొప్పున వేతనాలు చెల్లించింది. కానీ.. గడిచిన ఎనిమిది నెలలుగా అసలు వేతనాలే ఇవ్వడం లేదు. ఒకటీ రెండు నెలలుగా ఆశతో వేచి చూసిన ఆర్‌పీలకు నిరాశే మిగిలింది. ఏకంగా ఎనిమిది నెలలపాటు వేతనాలు విడుదల చేయకపోవడంతో కుటుంబాలను పోషించుకోలేక ఆర్థికంగా సతమతమవుతున్నారు. దీంతో తమ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 13న 'చలో హైదరాబాద్' కార్యక్రమానికి పిలుపునిచ్చారు. రాష్ట్ర రాజధానిలోని మెప్మా డీఎం కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నారు.

సమస్యలు పరిష్కరించండి మహాప్రభో..

జీవో 164 ప్రకారం వీఎల్ఆర్ స్త్రీనిధి, లోకల్ బాడీ నిధుల నుంచి రిసోర్స్ పర్సన్లకు గౌరవ వేతనం ఇవ్వాలనే నిబంధన తొలగించి గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్)లోని వీవోఏల మాదిరిగా ప్రభుత్వపరంగా ప్రత్యేక నిధులు కేటాయించి గౌరవ వేతనం ఇవ్వాలని ఆర్‌పీలు డిమాండ్ చేస్తున్నారు. పీఆర్‌సీ అమలు చేయాలని, రూ.20 వేల కనీస వేతనం ఇవ్వాలని, రాష్ట్రవ్యాప్తంగా ఆర్‌పీలకు ఒకే డ్రెస్ కోడ్ అమలు చేయాలని, జాబ్ చార్ట్ విడుదల చేయాలని, రూ.10 లక్షల బీమా సౌకర్యాన్ని కల్పించాలని, మూడు నెలలకోసారి ఈసీ తీర్మానాలను రద్దు చేయాలని కోరుతున్నారు. ఇలాంటి ప్రధానమైన డిమాండ్లతో ఆందోళనకు శ్రీకారం చుట్టారు. రాష్ట్రం ఏర్పడ్డాక సమగ్ర కుటుంబ సర్వే, జనగణన సర్వే, స్వచ్ఛ భారత్, హరితహారం, బడిబాట సర్వే, బతుకమ్మ చీరెల పంపిణీ, పల్స్ పోలియో, సదరం క్యాంపులు, కరోనా బాధితుల సర్వే, వారికి మందుల పంపిణీ వంటి అనేక ప్రభుత్వ పనుల్లో వీరు ముందుంటున్నారు. కీలకపాత్ర పోషిస్తున్నారు. కానీ.. కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏకంగా ఎనిమిది నెలలుగా వీరికి వేతనాలే ఇవ్వడం లేదు. దీంతో వీరి కుటుంబాలు ఆకలితో అలమటిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 6 వేల మంది ఆర్‌పీలు విధులు నిర్వహిస్తుండగా.. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 385 మంది పనిచేస్తున్నారు. ఇందులో భద్రాద్రి జిల్లాలోనే కొత్తగూడెం మున్సిపాలిటీలో 43, పాల్వంచలో 43, ఇల్లెందు 22, మణుగూరులో 20 మంది ఉన్నారు. నాలుగు మున్సిపాలిటీల్లో నలుగురు టౌన్ లెవల్ ఫెడరేషన్ సభ్యులు కూడా ఉన్నారు.

వేతనాలు అందక ఎనిమిది నెలలు..

తెలంగాణ ఏర్పడ్డాక కేసీఆర్ ప్రభుత్వం మా సమస్యలు కొన్ని పరిష్కరించింది. గౌరవ వేతనమూ పెంచింది. కానీ.. కొత్త ప్రభుత్వానికి ఎన్ని విజ్ఞప్తులు చేసినా మా సమస్యలను పట్టించుకోవడం లేదు. అసలు ఎనిమిది నెలలుగా వేతనాలే ఇవ్వలేదు. ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు పడుతున్నాం. అందుకు సమస్యల పరిష్కారం కోసం పోరుబాట పట్టాం.
-తిరుపతి, కొత్తగూడెం మెప్మా ఆర్‌పీ, ఆర్‌పీ అసోసియేషన్

10వ వార్షికోత్సవ శుభాకాంక్షలతో..
జీవన్ హాస్పిటల్
ఎస్.బి.ఐ./ ఆంధ్రాబ్యాంక్ ప్రక్కన, భద్రాచలం,
ఫోన్: 08743-233666, సెల్: 7075851666
MBBS, DGO
MBBS, DA,DIP IN Diabetology
స్త్రీల వ్యాధి నిపుణులు
ఫిజీషియన్ & డయాబెటాలజిస్ట్
స్త్రీలకు అత్యధికంగా సిజేరియన్ డెలివరీలు, సర్జరీ కొత్తగా కుమారుడు : చెల్లగుళ్ళ నాగేశ్వరరావు - ఇజయలక్ష్మి
స్త్రీలకు ప్రత్యేక వార్డులు - ఆధునిక పరికరాలు
స్త్రీలకు ఎమర్జెన్సీ - ఆపరేషన్ థియేటర్ - లేబర్ రూమ్ - స్త్రీల వార్డు

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616